గీతామాత్ర సంతర్పణము

ముసురు కాస్త తెరపి ఇయ్యటం చూచుకొని, చిన్న భావమరది వెంకటేశాన్ని పోరి పోరి, బ్రహ్మప్రయత్నంమీద ఎలాగో చివరకు సముద్రసందర్శనానికి బయలుదేర తీయగలిగాడు గోవిందు. కాఫ్యాది ప్రాతః కాల ఆవశ్యకాలు తీర్చుకుని, ఎనిమిదిగంటలకల్లా భావమరదులిద్దరూ సైకిళ్లకి ముందు గొడుగులు తగిలించుకొని సముద్రాభిముఖంగా బయలుదేరారు. ఆ ఊరికి సముద్రం అయిదుమైళ్ల దూరంలోఉంది. అక్కడక్కడ చిన్న చిన్న నీళ్ళపడియలతోనూ, బురదతోనూ చికాకుగా ఉన్న రోడ్డుమీద, ఈడ్చి ఈడ్చి కొడుతూన్న ఈదురుగాలిని చీల్చుకుంటూ అతి కష్టంమీద సైకిళ్లు ముందుకి సాగిపోతున్నవి.

ఆ ముసురులో, చలిలో, ఆ ఉదయం పూట సముద్రానికి బయలుదేరటం వెంకటేశానికి ససేమిరా ఇష్టంలేదు. ఎదురుగా వస్తూన్న జనం ఎందుకోసం నవ్వుతున్నా, తమను చూసే నవ్వుతున్నారని భావిస్తూ, అతడు భావగారివేపు కొరకొరలాడుతూ చూస్తున్నాడు. గోవిందుమాత్రం ఇకకొన్ని నిముషాల్లో తమ కన్నులముందు సాక్షాత్కరింపబోతున్న గంభీర సుందర సముద్ర మూర్తిని లోలోపల భావించుకుంటూ పరవశుడై పోతున్నాడు.

వాడు. మొదటినుంచీ మానవ సంఘమంటే అతనికి తగని అవిశ్వాసం, అనాదర భావం ఉండేవి. తాను చదివిన పాశ్చాత్య సారస్వతంద్వారా మానవుణ్ణి స్వార్థపరుడుగానూ, సర్వవిధములైన దౌర్బల్యాలకీ స్థానంగానూ మాత్రమే అతను అర్థం చేసుకున్నాడు. పాశ్చాత్యదేశాలతో పోల్చి చూస్తే, భారతదేశం మరీ అనాగరకమైనదనీ, అందుచేత ఇక్కడి మానవసమాజం మరింత నికృష్టశ్రేణికి చెందిందనీ కూడా అతను విశ్వసించేవాడు.

సముద్రమంటే గోవిందు అంతగా ప్రాణాలు విడవటానికి మరొక కారణం కూడా లేకపోలేదు. అతని స్వగ్రామానికి ఎటు చూచినా నూరు మైళ్లలో పుగా సముద్రంలేదు. పెళ్లికి అత్తవారి ఊరికి తరలి వచ్చిన సందర్భంలోనే అతను మొట్ట మొదటిసారిగా సముద్రాన్ని చూచాడు. అటుపిమ్మట ఎప్పుడు అత్తవారి ఊరు వచ్చినా, కనీసం ఒకసారిఅయినా సముద్ర తీరానికి పోయిరావలసిందే! అయితే ఈసారి అతడు బ్రహ్మాండమైన ఒక ముసురునుకూడా వెంట పెట్టుకొని మరీ వచ్చాడు. అతను వచ్చి మూడు రోజులైనా ముసురు పూర్తిగా తెరపిఇచ్చే సూచనలు కనిపించలేదు. ఇక స్వస్థలానికి తిరిగి వెళ్లిపోవలసిన రోజు కూడా వచ్చింది. అందుచేత పట్టుబట్టి ఆ ఉదయం వెంకటేశాన్ని బయలు దేర తీశాడు. అతని దృష్టిలో సముద్రతీరానికి పోవటానికి వర్షమూ, ముసురూ, ఈదురుగాలీ - ఇలాంటివి ప్రతిబంధకాలు కానేకావు. పైపెచ్చు వర్షాసమయంలో సముద్రదేవత మరింత సౌందర్యాన్ని సంతరించుకొని- అతని కవిహృదయానికి అసాధారణమైన తృప్తిని కలిగించగలదనే ఆశ కూడా లేకపోలేదు.

సముద్రం ఇంకా రెండుమూడు ఫర్లాంగులుందనగానే 'రంయ్యా' మని హోరు వినిపించింది. రంగు రంగుల పిట్టలు కనిపించినవి. గోవిందు హృదయం మహానందంతో ఎగిరి గంతు వేసింది. ఆ సముద్రపు హోరులో - అనంతాకాశంలో గ్రహాల నిరంతర పరిభ్రమణంలో వెలువడే మధురాతి మధురమైన సంగీతాన్ని అతడు విన్నాడు.

అది ఒక చిన్నపల్లె. చెలియలికట్ట నానుకుని సముద్రం ఒడిలోఉన్న లక్ష్మీదేవిలాగ నిరంతరం కలకలలాడుతూ ఉంటుంది ఆ ఊరు. గోవిందు అత్తవారి అసలు స్వగ్రామం అదే! అక్కడ వాళ్ల కొక ఇల్లూ, ఒక తోటకూడాఉన్నవి. ఆ ఇంటిని పాడుపెట్టి గోవిందు మామగారు పిల్లల చదువులనిమిత్తం 10, 15 ఏళ్లక్రితం దగ్గరలోఉన్న బస్తీకి కుటుంబాన్నిమార్చాడు. క్రమంగా అక్కడే ఒక ఇల్లూ అదీ కొనుక్కొని స్థిరపడిపోవటం జరిగింది.

పల్లెవాళ్ళ గుడిసెలతోసహా ఆ పల్లెలో రెండు మూడువందల గడపకంటే ఉండదు. సమీపంలో బస్తీలలో పెద్ద పెద్ద వాణిజ్య సంఘాలు స్థాపించుకున్న కొందరు తెల్ల దొరలు తమ వేసంగి మకాముని మిత్తం చెలియలికట్టమీదనే రెండు మూడు బంగళాలు నిర్మించుకున్నారు.

బావమరదు లుభయులూ సముద్ర తీరాన్ని చేరుకునేసరికి ఇంచుమించు తీరం నిర్మానుష్యంగా ఉంది. నీటిఅంచు చేరువనే చేపలు పట్టే తెప్పకొయ్యలు కొన్ని పడిఉన్నవి. దూరంగా సముద్రంమీద రెండు అలాంటి తెప్పకొయ్యలు కెరటాలతోపాటు ఉవ్వెత్తుగా పైకి లేస్తూ, చాపచుట్టగా క్రిందికి కూలుతూ, ఈ క్షణం కనిపిస్తూ, మరుక్షణం కనుమరుగవుతూ, ఒయ్యారంగా నాట్యంచేస్తూ తీరంవేపు వస్తున్నవి. రంగురంగుల పిట్టలు చిత్రచిత్రాల ఆరావాలు చేస్తూ పైని విచిత్ర చంక్రమణాలు చేస్తున్నవి. తీరాన సరుగు చెట్లలో గాలి రంయ్యన రొదచేస్తున్నది. తెల్లని పొగమంచు పడుతూ దూరభూరేఖ స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నది.

మానవజగత్తు సంకుచిత ఆవరణలనుంచి తప్పించుకుని భూగోళపు ఒక అంచుమీదికి వచ్చి నిలబడినట్లు భావించుకుంటూ గోవిందు ఒక దీర్ఘనిశ్వాసాన్ని విడిచాడు. రాత్రి అనకుండా, పగలనకుండా నిరంత

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

గోవిందు కవి. పట్టభద్రసముద్రతో కాలేజీనుంచి అప్పుడే బయటకు వచ్చినవాడు. ఇంగ్లీషుభాషలో నావిక జీవితానికి సంబంధించిన సారస్వతం అతన్ని అమితంగా ఆకర్షించింది. కాలేజీలో చదువుకునే రోజుల్లో సముద్రాన్నిగూర్చి అతడు చిత్రచిత్రాల కలలు కనేవాడు. ఏ ఓడమీద అయినా తనకొక ఉద్యోగం లభించి, ఈ మానవజగత్తుకి దూరంగా జలదేవతచల్లని వడిలో, విశాలాకాశపు చాందినీ క్రింద తన భవిష్యత్ జీవితమంతా గడిపివేయగలిగితే ఎంతో బాగుండు ననుకునే

రాయంగా ఒక దానివెంట ఒకటిగా ఉబికి వచ్చే ఆ సముద్రతరంగాలను చూస్తూ అలా యుగాలకాలం గడిపివేయవచ్చు ననుకున్నాడు.

ఇంతలో - ఆకాశంలో మళ్లీ మేఘాలు గుంపులు గుంపులుగాచేరి గుజగుజలాడటం మొదలుపెట్టినవి. క్రమంగా సన్నని తుంపర కూడా సాగింది.

సముద్రపు సరదా తీరిందా బావా! ఇకనైనా ఇంటిముఖం పడతావా?" అన్నాడు వెంకటేశం వెటకారంగా.

సమాధానంగా గొడుగు విప్పాడు గోవిందు.

"ఎవరైనా చూస్తే నవ్విపోతారు బావా! ఈ వర్షంలో, ఈ ముసురులో ఈ బీచి షికారేమిటి?"

మరో ప్రపంచంలోనించి లాగ చూస్తూ గోవిందు ఏమీ బదులు చెప్పకుండా, అప్పుడే తెప్పకొయ్యలమీద ఒడ్డుకి చేరుకున్న పల్లె వాళ్లని చూసి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

"సౌందర్యోపాసన బాగానే ఉంది కాని, బావా! ఈ చలికి ముందు నా ప్రాణాలు ఇక్కలాక్కొస్తున్నవి. వేడి వేడి కాఫీనీళ్లయినా దొరికి ఏడవవు - ఈ నిప్పచ్చరపు పల్లెటూళ్ళో. ఇంతటనైనా ఇంటికి పోదాం నడుద్దూ" - అన్నాడు మళ్లీ వెంకటేశం.

వేడివేడి పానీయం ఏదైనా దొరికితే బాగుండునని గోవిందుకికూడా అనిపించింది. అదికాక - వాన జోరవుతున్నది. ఊళ్ళోకి పోయి తలదాచుకోటంకంటె గత్యంతరం లేదు.

"కాఫీ కాకపోయినా, వేడి వేడి పాలైనాదొరకవచ్చు రా వంకూ! ఊళ్లోకి పోతే" అన్నాడు గోవిందు.

ఇద్దరూ గొడుగులు వేసుకొని సైకిళ్లు నడిపించుకుంటూ ఊళ్లోకి బయలుదేరారు. శిథిలావస్థలో ఉండిన తమ ఇల్లుగల సందులోకే దారితీశాడు వెంకటేశం. తమ ఇంటికి నాలుగిళ్ల ఇవతలే ఒక పూరింట్లో గుమ్మంలో కూచొని, బియ్యం ఏరుకుంటున్న ఒక పదిహేనేళ్ల స్త్రీ వానలో సైకిళ్లను నడిపించుకుంటూ, గొడుగుల క్రింద సగం సగం తడిసిపోతూ దారిని పోతూన్న వాళ్ళని ఆపి పలకరించింది. వర్షం వెలిసే దాకా తమ అరుగుమీద ఆగి వెళ్లమంది. ఆమె కంఠంలో వినిపించిన ఆజ్ఞకాని ఆజ్ఞ- వాళ్లు సైకిళ్లను చూరుక్రిందికి జేర్చి, ఆ ఇంటి అరుగుమీదికి చేరుకునేట్టు చేసింది.

"ఏ ఊరు నాయనా! మనది...పాపం వర్షంలో బయలు దేరి వచ్చారు!" అంటూ ఆమె వాళ్ల జవాబుకోసం నిరీక్షించకుండానే-" అక్కర్! ఒక చాప తెచ్చి ఇలా అరుగుమీద వెయ్యమ్మా - కూర్చుంటారు పాపం!" అంది. పదమూడేళ్ళ ఒక కన్నె పడుచు సగం అల్లుకున్న జడని అలానే ఒక చేత్తో పట్టుకొనివచ్చి, రెండో చేత్తో చాప అరుగుమీద వేసి లోపలకు వెళ్లింది.

తలలు తుడుచుకుని, గొడుగులు విప్పి అరుగుమీద ఒక ప్రక్కగా ఆరబెట్టి, చాప మీద సర్దుకుని కూచున్న వెంటనే వెంకటేశం అడిగాడు: "ఈ ఊళ్ళో అమ్మకానికి పాలు ఎక్కడైనా దొరుకుతాయండీ?"

"కాఫీలకోసమా నాయనా! పాపం బస్తీ వాళ్ల లాగున్నారు. కాఫీ మా ఇంట్లో పెట్టించి ఇప్పిస్తాలెండి" అంటూ కూతురిని పిలిచి, "కుంపట్లో కాస్త డికాషన్ పెట్టి కాఫీ కలిపి ఇయ్యమ్మా! వీరెవరో పాపం మరి బెబ్బతిని వచ్చారు - గొప్ప ఇంటి బిడ్డల్లాగున్నారు"అంది ఆమె.

గోవిందుకి ఆమె ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు. తా మెవరో ముక్కూ మొగమూ కూడా ఆమె ఎరుగదు. ఆమె ఆదరణా, మాటమాటలోను ధ్వనిస్తూన్న ఆమె ప్రేమా చూచి ఆతనికి అమితమైన ఆశ్చర్యం కలిగింది. ఆమెతో ఇలా అన్నాడు: "మీకు అనవసరపు ఇబ్బంది కలిగించటం నాకు ఇష్టం లేదండి...పాలు, పంచదార, కాఫీ పొడుందొరికే చోటు చెప్పండి- నేను వెళ్లి తీసుకువస్తాను; మీరు కాఫీ కాచిపెడుదురుగాని, అదే మాకు పదివేలు."

అంతవరకూ సాధువుగా మాట్లాడుతూన్న ఆమె అల్లా గోవిందు మాటలికి ఒక్కసారిగా ఎక్కడలేని కోపం తెచ్చుకుని, "చాలుచాల్లే అబ్బాయి! మీ బస్తీ గడుసుతనాలు నా దగ్గిర పనికిరావు. ఇంటికి వచ్చిన వాళ్లకి కాసిని కాఫీనీళ్ల యినా ఇచ్చేగతి లేకపోలేదులే మాకు- మేమెంత పల్లెటూరివాళ్లమైనా!..." అంటూ కేకలు పెట్టింది.

రంగం చెడగొడుతున్నాడని బావగారికేసి కోపంగా చూస్తున్నాడు వెంకటేశం. అంత స్వతంత్రంగా ఆ పరాయి ఇల్లాలు తమను కూకలు వేయటం, ఆ మందలింపులో కూడా వాత్సల్యమే స్ఫురిస్తూ ఉండటం చూచి చిన్నప్పు డెప్పుడో చనిపోయిన తన తల్లి జ్ఞాపకంవచ్చి గోవిందుకన్నులు చెమ్మగిల్లినవి.

"మీరు చిన్న పిల్లలు నాయనా! మీకు తెలియదు. నేను చెప్పినట్టు మాట్లాడకుండా వినండి..."అంటూ క్షణంలో గొంతులోని కాఠిన్యాన్ని మటుమాయం చేసి మళ్లీ మృదువుగా మాట్లాడసాగింది... "పంచదారమాత్రం ఈ ఊళ్ళో బొత్తుగా దొరకటం లేదు నాయనా! మాతోపాటు ఇంత బెల్లపుకాఫీయే కలిపించి ఇస్తాను. అది గొంతులో పోసుకుని,—అప్పటికి బాగా కాస్త తగ్గుతుంది - మీ పనిమీద మీరు వెళ్లుదురు గాని..."

ఆమె మాట మాటా అమృతంలో ముంచి తీసినట్లు గోవిందు చెవులలో మధురాతి మధురంగా వినిపిస్తూంది. మాతృవాత్సల్యం చవిచూచి ఎరుగని గోవిందుకి, మానవ సమాజ విద్వేషిఅయిన గోవిందుకి ఆ మారు మూల పల్లెటూళ్ళో ఆ ప్రేమమయమూర్తి సందర్శనంవల్ల కలిగినంతటి ఆశ్చర్యం, ఆనందం, - అతను మొట్టమొదటిసారి సముద్రాన్ని చూసినప్పుడు కూడా కలుగలేదు.

కాసేపు ఆగి ఆమె మళ్లీ—"అయితే, నాయనా! మనది ఏ ఊరో, ఏం పనిమీద ఇలా వచ్చారో అప్పనేలేదు?" అంది.

ఆమెతో సంభాషణ పొడిగించే అవకాశంకోసం కనిపెట్టుకుని చూస్తూన్న గోవిందు వెంటనే తన మామగారిది అసలు ఆ ఊరే ననీ, పేరు ఫలానా అనీ, ప్రస్తుతం వాళ్లు ఫలానాచోట ఉంటున్నారనీ, ఆ వీధిలోనే తన మామగారి ఇల్లుకూడా ఉందనీ - విషయమంతా వివరంగా చెప్పాడు.

రెండు నిమిషాలసేపు వెంకటేశంకేసి పరకాయించి చూసి, ఆమె "అయితే, ఈ కుర్రాడు మారంగమ్మ కొడుకా ఏమిటి?" అంది. "ఎన్నో వాడివిరా, మూడోవాడివా?" అంది. ఆ తురక ఇల్లాలు అలా తనని ఏకవచన ప్రయోగం చేస్తున్నందుకు ముఖం చిట్లిస్తూ వెంకటేశం ఔనని తల ఊపాడు. ఇక - ఆమె గుక్క తిప్పుకోకుండా ఒక ప్రశ్నల వర్షం వాళ్లమీద కురిపించింది.

రంగమ్మకి వెంకటేశం తరువాత ఒక ఆడపిల్ల పుట్టిపోయిందని తను విన్నది. అంతేనా - అటుతరవాత మళ్ళీ ఏమైనా సంతానం కలిగారా? వాళ్ల పెద్ద పిల్లకి తమ ఊరువిడిచి వెళ్లేనాటికి ఒక మగపిల్లవాడు. వాడు ఖులాసాగా ఆడుకుంటున్నాడా? అటు తరువాత ఏమైనా పిల్లలా? రంగమ్మ ఎన్నో కూతుర్ని గోవిందుకి ఇచ్చారు? మిగతా ఆడపిల్లలకు కూడా పెళ్లిళ్లు అయినవా? అన్నట్టు రంగమ్మ ఆడబిడ్డ ఖులాపాయేనా? రంగమ్మ తోటికోడలూ, మరదీ, వస్తూ పోతూ ఉన్నారా? వెనుకటి మన స్పర్ధలన్నీ సర్దుకొనిపోయినవా?.....ఇలా ప్రశ్నమీద ప్రశ్నగా ఆ కుర్రవాళ్ళకి ఊపిరి సలుపకుండా ఆమె అడిగింది.

ఆ ప్రశ్నలకు సమాధానాలుగా సంతోషకరమైన వార్తలు చెవినిపడినప్పుడు ఆమె ముఖం చేటంత అయింది. విషాద వార్తలకు ఆమె కన్నులు చెమ్మగిల్లినవి. ముఖ్యంగా రంగమ్మ ఆడబిడ్డ కాలంచేసిందని విన్నప్పుడు ఆమె పరితాపం చెప్ప నలవికాదు. రంగమ్మకీ తనకీ తగని స్నేహం. ఎప్పుడూ తమ ఇంట్లోనే ఉండేది. రంగమ్మ ముచ్చట్లన్నీ స్మరించి, ఒక్క నిట్టూర్పు విడుస్తూ అంది: "చిన్నతనంలోనే తలమాసినా - పాపం! ఎంతో బుద్ధిమంతురాలని పేరు తెచ్చుకుంది."

ఇంతలో కాఫీ కలిపి లోపలినుంచి అక్తర్ తల్లిని కేకవేసింది. "కలపటం అయితే రెండు గ్లాసుల్లోపోసి ఇలా తీసుకురా అమ్మా!" అంది లోపలికి తొంగి చూస్తూ తల్లి. బాల్యయౌవనాల సంధ్యారక్తిమతో ఎరుపెక్కిన కపోలాలతో ఆ కన్నెపడుచు 'నువ్వే తీసుకొని వెళ్లుదూ' అన్నట్టు చేతులతో తల్లికి సంజ్ఞచేసింది. తల్లి నవ్వుతూ "వెర్రిపిల్లా! సిగ్గెందుకు? అన్నయ్యకాదూ వెంకన్న నీకు? ఇలా తీసుకురా ఫరవాలేదు" అంది. సిగ్గుపడుతూనే అక్తర్ కాఫీగిన్నె ఒక గుడ్డతో పట్టుకొని తెచ్చి, అరుగుమీదపెట్టి, రెండు గ్లాసులు కూడా ప్రక్కన ఉంచి, గిరుక్కున తిరిగి లోపలికి వెళ్లిపోయింది.

తల్లి ఆమె సిగ్గుచూసి నవ్వుతూ, చిన్నప్పుడు అక్తర్ ఒక్క క్షణం కూడా వెంకు అన్నయ్యని ఎలా విడిచి ఉండేది కాదో, వెంకయ్యా ఎంతెంత దుండగపు పనులు చేసేవాడో అన్నీ ఏకరువుపెట్టింది.

అచ్చమైన ప్రేమతో తడిసిన ఆమె మాటలు వింటున్న గోవిందుకి త్రాగుతూన్న కాఫీ అమృతాయమానంగా అనిపించింది. మొదట సముద్రపు ఒడ్డునుంచి కాఫీకోసం ఊళ్ళోకి వచ్చేటప్పుడు గోవిందు వర్షం కాస్త తెరపిఇస్తే మళ్ళీ సముద్రపు ఒడ్డుకి వెళ్ళి, ప్రకృతిసౌందర్యాన్ని మరి కొంతసేపు ఆస్వాదనచేసి మరీ ఇంటికిపోదామనుకున్నాడు. కాని, ఇప్పుడు సముద్రతీర దృశ్యంమీద అతనికి వాంఛ సన్నగిలింది. సముద్రంకంటె విశాలమైన ప్రగాఢమైన తత్వం మానవప్రకృతిలో అతనికి ప్రత్యక్షమైంది. తాము ఇంటికి తిరిగి వెళ్లవలెనని గాని, ఆనాడే తాను తన స్వస్థలానికి ప్రయాణం కూడా పెట్టుకున్న సంగతి గాని-ఏవిషయమూ అతనికి గుర్తులో లేదు.

ప్రొద్దెక్కుతూంది బావా! ఇంక బయలుదేరుదాం. వర్షం కాస్త తెరిపి ఇచ్చింది కూడాను!" అంటూ వెంకటేశం మధుర స్వప్నంలోనుంచి బావగారిని మేలుకొలిపాడు. గోవిందు ఒక్క నిట్టూర్పు విడుస్తూ అనిష్టంగానే లేచి, "మేము ఇక వెళ్లివస్తాముండీ పిన్నిగారూ!" అంటూ గొడుగు ముడిచి సైకిలుకి తగిలించి ప్రయాణసన్నాహం చేశాడు.

"ఇంత ప్రొద్దెక్కి ఇప్పుడేమి వెళుతారు నాయనా! కరణంగారి ఇంట్లో చెబుతాను. భోజనం చేసి నిదానంగా వెళ్లరాదూ?" అంది ఆమె. ఆ ఆదరణకూ, నిసర్గమైన ప్రేమకూ గోవిందు కన్నులు చెమ్మగిల్లినవి. తన కానాడు అక్కడ ఉండిపోవలననే ఉన్నా, అప్పటికప్పుడే సైకిలు అధిరోహించే ప్రయత్నంలోఉన్న వెంకటేశాన్ని చూచి, ఆ ఊహ విరమించుకున్నాడు." ...క్షమించండి, మరొకప్పుడు వస్తాంగదా - మా వాళ్లు ఎదురుచూస్తూ వుంటారు..." అన్నాడు.

"సరే నాయనా! అలాఅయితే త్వరగా వెళ్లండి. మళ్లీ భోజనానికి ప్రొద్దెక్కుతుంది" అంటూ ఆమె వెంకటేశాన్ని లోపలికి పిల్చి, ఒక బుట్టలో జీడిమామిడి పళ్లూ, ముళ్లగోరింట పువ్వులూ కట్టి ఇచ్చి వాడు "ఇవన్నీ ఏమిటండీ - వద్దండీ అంటున్నా వినిపించుకోకుండా, "ఇవి మీ అమ్మకిచ్చి, 'నీచెల్లెలు పాపాబీగం చచ్చిపోయిందనుకున్నావా? ఒక్కసారి అయినా మళ్ళీ వచ్చి చూశావు కాదు!' అన్నానని చెప్పరా - మీ అమ్మతో" అంది.

తిరిగివస్తూ, దారిపొడుగునా ప్రేమమయి అయిన ఆ ముస్లిం కాంత మాటలే మననం చేసుకుంటూ, "ఇంతేనేలే సముద్రమెంతో అనుకొంటి" అన్న యెంకిపాట పల్లవిని గొణుక్కుంటూన్న గోవిందుకి వెంకటేశం చెప్పకుపోతూన్న తన స్కూలు విశేషాల్లో ఒక్కటీ చెవిని పడలేదు. ★

నమ్మకమైన నంజన్‌గూడు ఔషధములు
కాశ్మీర్-కుసుం
కేశ వృద్ధికి
సాంటలక్స్
దురద తెగ గడ్డలు, కాటులు మొటిమలకు
ప్రేమలీలా
ప్రసిద్ధమైన మైసూర్ ఊదువత్తులు.
నంజన్‌గూడు సంస్థపాది ఫార్మాకోపీవారి ప్రసిద్ధ ఔషధములను వాడుడు.
ది యునైటెడ్ కంపెనీ, 54. బందర్ వీధి, మద్రాసు.
బెజవాడ డిపో, సూర్యారావుపేట.